ప్రజాశక్తి
గురువారం 21 డిసెంబర్ 2023
5
అల్లూరి సీతారామరాజు

స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:అల్లూరి సీతా రామరాజు జిల్లా చింతపల్లి మండలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఆదివాసులకు జిఓ 3 చట్టబద్ధత, గిరిజన స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్‌పై ప్రకటన చేయాలని ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా ఆదివాసి గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ డిమాండ్ చేశారు. బుధవారం అరకులోయ భవనంలో బాలదేవ్, మండల అధ్యక్షులు జి.బుజ్జిబాబు, నాయకులు పి నానిబాబు, జి.రామన్న,కెసుబ్బారావులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ, జిఓ 3 రద్దు చేసి మూడు సంవత్సరాలు గడుస్తున్నా ముఖ్యమంత్రి ఎందుకు మౌనంగా ఉన్నారో చింతపల్లి పర్యాటన సందర్భంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో గిరిజన ఆశ్రమ, మండల పరిషత్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 1500 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వం పాడేరు ఐటిడిఏ పరిధిలో నూతన విద్యా విధానం పేరుతో 107 పాఠశాలలు మూసేసిందని, దీంతో ఆదివాసి ప్రాంతంలో విద్యాభివృద్ధి ఎలా సాధ్యమవుతుందన్నారు. జీవో 3కు చట్ట బద్ధత కల్పించి గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు.

అంగన్వాడీల భిక్షాటన...వంటావార్పు

అనంతగిరిలో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: అంగన్వాడి కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె బుధవారం 9వ రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలో భిక్షాటనతో నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షురాలు కే.కొండమ్మ మాట్లాడుతూ, న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల కార్యదర్శి సత్యవతి, పవిత్ర, మండలంలోని అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:మండల కేంద్రంలోని అంగన్వాడీ టీచర్లు,హెల్పర్లు భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి నాయకులు మాట్లాడుతూ, ప్రతీ పక్షంలో ఉన్నప్పుడు వైసీపీ అధికారంలోకి వచ్చాక తెలంగాణ ప్రభుత్వం కంటే అదనంగా జీతాలు పెంచుతామని మాయమాటలు చెప్పి అంగన్వాడిలను తీవ్రంగా మోసం చేశారని ధ్వజమెత్తారు.ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడుతున్నామన్నారు.సచివాలయం ఉద్యోగులతో అంగన్వాడి సెంటర్ల తాళాలు బద్దలు కొట్టించడం సరికాదన్నారు.ఈ కార్యక్రమంలో డి.నాగమ్మ, పి వెంకట్ లక్ష్మి, కె.లక్ష్మి, నిర్మల పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు:అంగన్వాడీల సమ్మెకు ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు గల్లేలా నారాయణ, జీనబంధులు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 9 రోజుల నుంచి నిరసనలు చేపడుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరిం చాలన్నారు. అంగన్వాడి సంఘం నాయకులు అంగన్వాడీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హుకుంపేట:- మండలంలోని అంగన్వాడి టీచర్లు న్యాయమైన డిమాండ్లతో చేపట్టి నిరసన బుధవారం 9వ రోజు చేరుకుంది. సమ్మె సందర్భంగా మహిళా సంఘం అల్లూరి జిల్లా కార్యదర్శి ఎస్.హైమావతి. ఆధ్వర్యంలో స్థానిక ఐసిడిసి కార్యాలయం నుంచి మూడు రోడ్లు కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. అంగన్వాడి టీచర్లకు రూ.26000 వేతనం చెల్లించాలంటూ భిక్షాటన చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు అప్పలకొండమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

పెదబయలు :స్థానిక అంబేద్కర్ కూడలి జంక్షన్ వద్ద అంగన్వాడీలు సమ్మె కొనసాగించారు. మధ్యాహ్నం శిబిరం వద్ద భోజనాలు చేసి నిరసన కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సమ్మెకు యూనియన్ నాయకురాలు రాజమ్మ, పద్మ, మంగమ్మ, సుశీల, సీఐటీయూ జిల్లా కమిటీ నాయకులు సన్నిబాబు, మాజీ ఎంపీపీ వి కొండయ్య , లక్ష్మీపేట సర్పంచ్ అశోక్ పాల్గొన్నారు.

రంపచోడవరంలో ఒంటి కాలిపై నిరసన

అనంతగిరి:మండల కేంద్రంలో అంగన్వాడిలు భిక్షాటన చేపట్టారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ మండల నాయకురాలు పి.కళావతి, .కుమారి, చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల భిక్షాటన

ప్రజాశక్తి -ఎటపాక : గత తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు నిరసన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం భిక్షాటన చేశారు. అంగన్వాడిల పోరాటంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కుంజా విజయకుమారి, రాజ్యలక్ష్మి, సుజాత, రమ్య, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండల కేంద్రం రేఖపల్లి జంక్షన్‌లో 9వ రోజు నిరసన కార్యక్రమాన్ని సిఐటియు జిల్లా సభ్యులు సున్నం రంగమ్మ ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్తలు ప్రతి దుకాణానికి వెళ్లి తమ సమస్యలను చెబుతూ భిక్షాటన చేశారు. కార్యక్రమంలో ఎంపిపి కారం లక్ష్మి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనం సత్యనారాయణ, ఐద్వా నాయకులు ఐ.పద్మ, సున్నం పార్వతి, యూనియన్ నాయకులు నాగమణి, రాజేశ్వరి, సిపిఎం నాయకులు సోయం చిన్నబాబు, పంకు సత్తిబాబు,

దుంబ్రిగుడలో..

పాడేరులో...

వీర్ల నాగేశ్వరరావు, హాజరత్, ఎస్ఎఫ్ఐ నాయకులు సుధీర్ పాల్గొన్నారు.

ఒంటి కాలిపై నిరసన

రంపచోడవరం : అంగన్వాడీల తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని చేపట్టిన నిరసన దీక్షలు తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి ఈ సందర్భంగా స్థానిక తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో బుధవారం ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.రామలక్ష్మి, కె మంగాయమ్మ, బి సింగారమ్మ, ఎం సత్యవేణి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

చింతూరు : అంగన్వాడీ 9వ రోజు నిరసన కార్యక్రమాన్ని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, సీనియర్ నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనకు కాంగ్రెస్ రాజమండ్రి జిల్లా అధికార ప్రతినిధి కొవ్వూరు శ్రీనివాసరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో తుమ్మల ఎంపీటీసీ వేక రాజ్ కుమార్, సిపిఎం నాయకులు పల్లపు పెద్ద రాములు, మొట్టం రాజయ్య, పొడియం లక్ష్మణ్, యూనియన్ నాయకులు వెంకటరమణ, స్వరూప, పార్వతి, వసంత, దుర్గ, చిట్టమ్మ, కిట్టమ్మ, వీరమ్మ, కనకదుర్గ, సత్యవతి, విజయ కుమారి పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన నిరసన దీక్షలు బుధవారం నాటికి తొమ్మిదవ రోజు చేరాయి. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నిర్మల కుమారి, ప్రసూన, మారేడుమిల్లి, వై.రామవరం మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : మండల కేంద్రంలోని ఆర్ అండ్బి అతిథి గృహం ఎదురుగా అంగన్వాడీలు చేపట్టిన నిరసన దీక్ష 9వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా యూనియన్ మండల కార్యదర్శి కె వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. ఆశా యూనియన్ నాయకులు ఎ.అమ్మిరాజు ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నములు, కుమారి, సత్యవతి, మంగ, రాజేశ్వరి, రాణి, రమణి, సుందరమ్మ, సూర్యకుమారి పాల్గొన్నారు.

నేడు చింతపల్లిలో సిఎం జగన్ పర్యటన

పటిష్టంగా ఏర్పాట్లు- భారీ బందోబస్తు

ఏర్పాట్లపై ఆరా తీస్తున్న మంత్రి అమర్

ప్రజాశక్తి -చింతపల్లి:రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గురువారం చింతపల్లిలో పర్యటించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఇబ్బందులు లేకుండా అన్ని రకాలుగా ఏర్పాట్లు ఎమ్మెల్యే కే.భాగ్యలక్ష్మితో కలిసి మంత్రి అమర్ పరిశీలించారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి 21న ఉదయం 8:30 గంటలకు తాడేపల్లి సీఎం నివాసం నుంచి బయలుదేరి ప్రత్యేక విమానంలో 9:50 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో 10.30 గంటలకు చింతపల్లి మండలం చౌడిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో దిగి అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా చౌడిపల్లి గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలకు చేరుకుంటారు. అక్కడి విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేస్తారు. అనంతరం అక్కడ నుంచి ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి రోడ్డు మార్గం ద్వారా చేరుకొని స్మాల్ టెక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లెర్నింగ్ అండ్ టీచింగ్ కార్యక్రమంలో పాల్గొంటారు. 11 20 గంటలకు ప్రత్యేక సభ ప్రాంగణంలోకి చేరుకుంటారు. అక్కడ 40 నిమిషాలు గిరిజనులను ఉద్దేశించి మాట్లాడుతారు. అనంతరం 12:30 గంటలకు సభా ప్రాంగణం నుంచి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడే దాదాపు 30 నిమిషాలు స్థానిక నాయకులతో మాట్లాడుతారు. అనంతరం 1:30 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. ప్రత్యేక విమానంలో గన్నవరం నివాసానికి చేరుకుంటారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ, పలువురు అధికారులు పర్యవేక్షించారు.

ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం

సమస్యలు పరిష్కరిస్తానని..

కాఫీ రైతులకు సిఎం హామీ ఇవ్వాలి

కాఫీ రైతుల సంఘం జాతీయ అధ్యక్షులు చిన్నబాబు

ప్రజాశక్తి-అరకులోయరూరల్:కాఫీ రైతుల సమస్యపై ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్పష్టమైన హామీ ఇవ్వాలని కాఫీ రైతుల సంఘం జాతీయ అధ్యక్షులు జి.చిన్న బాబు డిమాండ్ చేశారు.బుధవారం అరకువేలి ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో స్థానిక విలేకరులతో కాఫీ రైతుల సంఘం జాతీయ అధ్యక్షులు జి. చిన్న బాబు మాట్లాడారు. పాడేరు ఏజెన్సీ 11 మండలాల్లో లక్ష 40 వేల మంది కాఫీ పంటపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. 15వేల మెట్రిక్ టన్నుల కాఫీ దిగుబడి అవుతుందని దీనికి ప్రభుత్వం నుండి సరైన ధర ప్రకటించక పోవడంతో రైతులు దళారుల చేతుల్లో రైతులు తీవ్రంగా నష్టోతున్నారన్నారు. అంతర్జాతీయంగా దేశ విదేశాల్లో మార్కెట్‌లో అరకు అర్గానికి కాఫీకు మంచి ధర ఉందని, కష్టపడి పండించే రైతుకు మాత్రం గిట్టుబాటు ధర లేదన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా రైతుల నుండి కాఫీని ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలన్నారు.కిలో కాఫీ పచ్చి పళ్ళు రూ.150, రూ పార్చిమెంట్ 500, చెర్రీ కాఫీ రూ.270, మిరియాలు కిలో రూ.1000లకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. 2019 నుండి 2022వరకు బకాయి పడ్డ 60కోట్లు డబ్బులు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. జి.సిసి నుండి రైతులకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, ప్రతి రైతుకు పల్పింగ్ మిషన్, నిచ్చెనలు ఇవ్వాలన్నారు. కాఫీ, సిల్వర్ తోటలకు ఇన్సూరెన్స్ కల్పించాలని కొత్తగా తోటలు పెంచుకొన్నే రైతులకు ఉచితంగా మొక్కలు ఐటీడీఏ ద్వారా సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన కాఫీ రైతుల సంఘం మండల కార్యదర్శి సిహెచ్ గురుమూర్తి, సంఘం అధ్యక్షులు జి.కొండలరావు, రైతులు కె.సుబ్బారావు, జి.గణేష్, జి.రామన్న, కె రామారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జి చిన్నబాబు

అమ్మఒడి రాకుండా అన్యాయం చేసిన

వెల్ఫేర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-చింతూరు

అమ్మఒడి విషయంలో గూడూరు సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ తమకు అన్యాయం చేశాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని గూడూరు గ్రామస్తులు సోడి వెంకటలక్ష్మి అధికారులకు విజ్ఞప్తి చేశారు. తన ఏకైక కుమార్తె సోడే అన్విక, గూడూరు ఆశ్రమ పాఠశాలలో ప్రస్తుతం రెండవ తరగతి చదువుతుందని, 2022-2023 విద్యా సంవత్సరానికి సంబంధించిన అమ్మ ఒడి మంజూరు లిస్టులో తన కుమార్తె పేరు రాలేదని, ఆ విషయంపై సచివాలయం వెల్ఫే అసిస్టెంట్‌ను సంప్రదించగా సరి చేయాల్సిన ఏ విషయం చెప్పకుండా హెచ్ఎంను కలవమని చెప్పారని, హెచ్ఎంను కలిస్తే సచివాలయానికి వెళ్ళమని చెప్పారని తెలిపారు. ఇలా కార్యాలయాల చుట్టూ పదేపదే తిప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్లో వచ్చిన లిస్టును సరిగా పరిశీలన చేసి తమకు రావాల్సిన పథకం అమలు చేయడంలో డిజిటల్ అసిస్టెంట్ నిర్లక్ష్యం చేశాడన్నారు. తన పాపకు రావలసిన 13000 రూపాయలు వెల్ఫేర్ అసిస్టెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యను పరిష్కారం చేయకపోతే పాపతో సచివాలయం ముందు బైఠాయిస్తానని, అయినా పరిష్కారం కాకపోతే చింతురూ ఐటిడిఏ ముందు నిరాహార దీక్ష చేస్తానని స్పష్టం చేశారు.

మాట్లాడుతున్న సోడి వెంకటలక్ష్మి

అనారోగ్యంతో ఆనందమ్మ మృతి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఆదివాసీ పోరాట నాయకులు, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ సీనియర్ నాయకురాలు కామ్రేడ్ కొండా ఆనందమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. మారేడుమిల్లి మండలం జిఎం వలస ఆమె స్వగ్రామం. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు కుంజా దూలయ్య మాట్లాడుతూ ఆనందమ్మ మరణించడం పార్టీకి తీరని లోటన్నారు. ఆనందమ్మ సేవలు పంచాయతీ ప్రజలు ఎన్నటికీ మరువలేరని తెలిపారు. సర్పంచ్‌గా, ఎంపీటీసీగా కుండాడ, జిఎంవలస పంచాయతీ ప్రజలకు ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. నేటి యువత ఆమెను స్ఫూర్తిదాయకంగా తీసుకొని నడవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు అభిమానులు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

అంతిమ యాత్ర ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అంగన్వాడీ కేంద్రాలను

పాఠశాలకు అటాచ్ చేయడం సరికాదు

తహశీల్దారు, ఎంపిడిఒ, ఎంఇఒలకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-విఆర్.పురం

అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తున్న నేపథ్యంలో అంగన్వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలలకు అటాచ్ చేయడం సరికాదని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) స్పష్టం చేసింది. ఈ మేరకు యుటిఎఫ్ నాయకులు బుధవారం ఎంపీడీవో ఫణేంద్ర రెడ్డి, తహశీల్దారు ఎన్.శ్రీధర్, ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీలు మూడు సంవత్సరాలుగా ప్రభుత్వానికి తమ సమస్యలపై విన్నవిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని, దీంతో అనివార్యంగా సమ్మెకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అంగన్వాడీలను పాఠశాలలకు అటాచ్ చేయడం దారుణమన్నారు. ఇందుకు సంబంధించి రాతపూర్వక ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. పిల్లలకు మిడ్డేమీల్స్‌కు అయ్యే ఖర్చు ఎవరు భరిస్తారని ప్రశ్నించారు. చాలా పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా నడుస్తున్నాయని, వారి పనులనే భారంగా ఉండగా, ఇప్పుడు అంగన్వాడీ పిల్లల పని అప్పగించడం సరికాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రాథమిక పాఠశాలలకు అంగన్వాడీ సెంటర్స్‌ని అటాచ్ చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యస్ నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు కె వెంకట్, ప్రధాన కార్యదర్శి యస్ జగదీష్, కార్యదర్శులు ఓ మంగరావు రెడ్డి, ఎస్ అజయ్, ఎం.బాబు, పి.రామారావు, టి అర్జున్, ఎం. శ్రీనివాస్ రెడ్డి, సిహెచ్ శాంతకుమారి, విజయ, ప్రసాద్, ప్రేమాకుమార్, ఎస్.చందరావు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

1వ తేదీనే జీతాలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు జీతభత్యాలు 1వ తేదీనే చెల్లించాలని రంపచోడవరం శాసన సభ్యురాలు ఎన్.ధనలక్ష్మికి, శాసనమండలి సభ్యులు అనంత ఉదయ భాస్కర్‌కి యుటిఎఫ్ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై.విల్సన్ బాబు, జిల్లా కార్యదర్శి విశ్వరాజ్ మాట్లాడుతూ ఉద్యోగ ,ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా ఒకటవ తేదీన జీతాలు చెల్లించాలని, పిఆర్సి ఎరియర్లు సుమారు 6246 కోట్లు, కొత్తగా మంజూరు చేసిన డిఏ ఎరియర్లు 2500 కోట్లు, పిఎఫ్ లోన్లు ఫైనల్ పేమెంట్లు 1000 కోట్లు, సరెండర్ లీవులు తదితర ఎరియర్లు రూ.250 కోట్లు, ఎపిజిఎల్ఐ లోన్లు పిఎఫ్, ఫైనల్ పేమెంట్లు రూ.330 కోట్లు, పిఆర్సి ముందు కాలం నాటి డిఏ ఎరియర్లు 1136 కోట్లు, మొత్తము రూ.11,462 కోట్లు విడుదల చేయాలని కోరారు. దీనికి వారు స్పందిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సిహెచ్‌ఆర్ సనాతన బాబు, ఎన్ వెంగళరావు, కె సూరిబాబు, డి పెదలింగన్న, డి అనిల్ బాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు వినతి పత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

వార్డు బాయ్ పోస్టును నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలి

ప్రజాశక్తి -సీలేరు

ఏపీ జెన్కో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీలేరు భవ్య హాస్పిటల్‌లో ఖాళీ అయిన వార్డ్ బాయ్ పోస్ట్‌ను జాబ్ నోటిఫికేషన్ ద్వారా తక్షణమే భర్తీ చేయాలని సిఐటియు కార్యదర్శి టి.విష్ణుకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ సీలేరు పరిసర ప్రాంతాల్లో గిరిజనులు, గిరిజనేతరులు ఎంతోమంది నిరుద్యోగి యువకులు ఉన్నారని, జాబ్ నోటిఫికేషన్ ద్వారా ఖాళీలను భర్తీ చేస్తే వారికి అవకాశం కలుగుతుందని తెలిపారు. ఉద్యోగ నియామకాల్లో ఎటువంటి రాజకీయ నాయకులు ఒత్తిడికి, యూనియన్ అసోసియేషన్ అధికారులు సిఫార్సులకు తలవంచకుండా న్యాయబద్ధంగా నియామకాలు జరపాలని కోరారు. నిబంధనం ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేయని పక్షంలో సిఐటియు, గిరిజన గిరిజనేతర నిరుద్యోగ సంఘాలతో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు లోపాకారి నియామకాలు స్వస్థ పలికి అర్హులైన అభ్యర్థులతో నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని కోరారు.

సిఐటియు బ్రాంచ్ కార్యదర్శి విష్ణుకుమార్

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఎనర్జీ అసిస్టెంట్లు

నల్ల బ్యాడ్జీలతో ఎనర్జీ అసిస్టెంట్ల నిరసన

ప్రజాశక్తి-రంపచోడవరం

తమను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ రంపచోడవరం సెక్షన్ ఎనర్జీ అసిస్టెంట్లు నల్ల బ్యాడ్జీలు ధరించి బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 26వ తేదీ నుండి సచివాలయం విధులు మాత్రమే నిర్వహిస్తామని, 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విధులకు హాజరవుతామని స్పష్టం చేశారు. తాము సచివాలయానికి విధులు నిర్వహించాలా లేక విద్యుత్ శాఖకు విధులు నిర్వహించాలో తేల్చాలని, విధుల్లో మరణించిన వారికి 50 లక్షల రూపాయలు చెల్లించాలని, ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జగదీష్, కిరణ్, రాజు, రవి, చల్లన్న దొర, బాపన్న దొర తదితరులు పాల్గొన్నారు.

అటవీ ఉమ్మడి హక్కుల పటం తయారీపై శిక్షణ

ప్రజాశక్తి-మోతుగూడెం

చింతూరు మండలం, మోతుగూడెం పరిధిలో ఉన్న గ్రామాల్లో వ్యక్తిగత, సామూహిక, అటవీ హక్కు పత్రాలను పొందేందుకు నిర్దిష్టమైన విధానాన్ని అవలంబించాలని, దానికి గ్రామంలోని యువకులు పెద్దలు, స్త్రీలు అందరూ తమకు ఉన్న పరిజ్ఞానాన్ని వినియోగించి తగిన విధంగా సాంఘిక పటాలను తయారు చేయాలని శక్తి సంస్థ ప్రతినిధి శ్రీరామచంద్రమూర్తి అన్నారు. ఆషా సేవా సంస్థ ఒడియా క్యాంపు (బు) గ్రామంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో సయ్యద్ సుభాని మాట్లాడుతూ ఇటీవల ఈ ప్రాంతంలోని గ్రామాలలో అర్హులైన వారికి అటవీ హక్కు పత్రాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నందని చెప్పారు. ఈ ప్రాంత ఆదివాసీలు కుల ధ్రువీకరణ పత్రాలు పొందిన వారికి పోడు భూములకు సంబంధించి ఉమ్మడి, వ్యక్తిగత అటవీ హక్కు పత్రాలు పొందే హక్కు ఉందని పేర్కొన్నారు. దానికి తగిన విధంగా తయారు కావాల్సి ఉందన్నారు. రిసోర్స్ పర్సన్‌గా హాజరైన రామచంద్రమూర్తి వ్యక్తిగత పటాన్ని, సాంప్రదాయ సామాజిక అటవీ ఉమ్మడి హక్కుల పటం తయారు చేయడం గురించి వివరించారు. గ్రామంలోని యువతీ యువకులు, పెద్దలు పాల్గొని రెండు పటాలను వేశారు. మరికొన్ని వివరాలను చేర్చాల్సి ఉందని, వాటిని పెద్దలతో చర్చించి పూర్తి చేస్తామని యువత తరపున శంకర్ బాధ్యత తీసుకున్నారు.

పటం తయారీపై చర్చిస్తున్న గ్రామస్తులు

సమన్వయంతో మండలాభివృద్ధి

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి ఈశ్వరి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ : అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ కలిసి సమన్వయంతో మండల అభివృద్ధికి పాటుపడదామని స్థానిక ఎంపిపి బి.ఈశ్వరి చెప్పారు. కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి ఈశ్వరి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పని చేద్దామని ఆమె చెప్పారు. కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డ్రైవర్లు రాత్రివేళల్లో అందుబాటులో ఉండక పోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు సభ్యులు తెలిపారు. గుంటసీమ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించలేదని ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. దీనిపై వెంటనే సమాధానం ఇవ్వాలని ఆ పంచాయతీ సర్పంచ్ జి.నాగేశ్వరరావు నిలదీశారు. వివిధ పోలీస్ కేసులకు సాల్వెన్సి సర్టిఫికెట్లను ఇవ్వక పోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని, ఇకనుంచి సకాలంలో జారీ చేసే విధంగా చూడాలని సభ్యులు ఎంపిడిఒకు సూచించారు. గ్రామాల్లో ఎటువంటి ప్రభుత్వ కార్యక్రమాలు జరిగినా ప్రజాప్రతినిధులను గౌరవించి ఆహ్వానించాలన్నారు. మండల వ్యాప్తంగా జరిగిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే చెల్లించే విధంగా చూడాలని సభ్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సిహెచ్ జానికమ్మ, ఎంపీడీవో బి.ఉషారాణి, తహసిల్దార్ సిహెచ్ నాగమ్మ, సర్పంచ్ ల పోరం మండల అధ్యక్షుడు కేహరి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంతలో మెగా వైద్య శిబిరం

రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని కాశీపట్నం వారపు సంతలో నేచర్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.బి వికాస్ బాలరాజు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 213 మందికి వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా నేచర్ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ బాలరాజు మాట్లాడుతూ, గిరిజన గ్రామాలలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన లేక గిరిజనులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. కళా జాతా బృందంతో అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ బేబీ, జాహ్నవి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేచర్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఎస్.అనిస్, మండల కోఆర్డినేటర్లు రవి, బంగారు బాబు, ప్రసాద్, గౌరీ శంకర్ నాయక్, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

మహిళలకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి- సీతమ్మధార: ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయ ప్రాంగణంలో సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె రాజు నేతృత్వంలో, వైసిపి మహిళా విభాగానికి చెందిన 24వ వార్డు కార్పొరేటరుసాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు మ్యూజికల్ ఛైర్, కబడ్డీ, ఇతరత్రా ఆటల పోటీలను నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన కెకె.రాజు మాట్లాడుతూ,తన జన్మదినాన్నిసేవా కార్యక్రమాలతో నిర్వహించాలన్న సిఎం జగన్ ఆదేశాల మేరకు మహిళలకు వివిధ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. జివిఎంసి ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు సారిపల్లి గోవింద్, ఉషశ్రీ, ఆళ్ళ లీలావతి, శ్రీనివాస్, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ ఆలీ పాల్గొన్నారు

విశాఖలో నిరసన తెలుపుతున్న మెడికల్ రిప్స్

నాసిరకం మందులు అరికట్టాలి

- సమ్మె బాట పట్టిన మెడికల్ రిప్స్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నాసిరకం మందులను అరికట్టాలని, మందుల రంగంలో ప్రభుత్వ కంపెనీలను బలోపేతం చేయాలని ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటివ్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా కార్యదర్శి డి.స్రవంత్, రాష్ట్ర కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి డిమాండ్ చేశారు. ఎఫ్ఎంఆర్ఎఐ పిలుపు మేరకు మెడికల్ రిప్స్ దేశ వ్యాప్తంగా చేపట్టిన సమ్మె బుధవారం విశాఖ నగరంలో ప్రారంభమైంది. దీనిలో భాగంగా మెడికల్ రిప్స్ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేల్స్ ఆధారిత వేధింపులు, క్రమశిక్షణ చర్యలు ఆపాలన్నారు. అత్యవసర, నిత్యవసర మందులను ప్రభుత్వ ఆసుపత్రిలో పేదవారికి ఉచితంగా ఇవ్వాలన్నారు. ప్రభుత్వ రంగ మందుల కంపెనీలైన హెచ్ఎల్ లాంటి కంపెనీలను పునరుద్ధరించాలని కోరారు. మందులు, మందుల పరికరాలపై జిఎస్‌టిని ఎత్తివేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం సహాయ కార్యదర్శి శ్రీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు సంజయ్ కుమార్, జాతీయ కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావు, జిల్లా మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, కె.కిరణ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రజా వ్యతిరేక పాలనపై 'వేటగాడు'

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలనకు వ్యతిరేకంగా అతని జన్మదినం రోజున తాము రూపొందించిన వేటగాడు ఆడియో సీడీ ఆవిష్కరణ చేస్తున్నట్లు తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ త్వరలోనే వైసిపి ఖాళీ అవడం ఖాయం అన్నారు. జగన్ వైఖరి అతని పార్టీ సభ్యులకే నచ్చడం లేదన్నారు. వైసిపిలో వలసలు ప్రారంభమయ్యాయన్నారు. రాజధాని అమరావతిని కాదని, మూడు రాజధానులు అంటూ కొత్త రాజకీయానికి తెరతీసిన జగన్మోహన్ రెడ్డికి ఇప్పుడు ఓటమి బెంగ పట్టుకుందన్నారు. చివరికి మూడు రాజధానులు అంటూ ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేని పరిస్థితి వచ్చిందన్నారు. హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ.. ఇదిగో విశాఖపట్నం వస్తున్న.. అదిగో విశాఖపట్నం వస్తున్న.. అంటూ జగన్ కాలక్షేపం చేస్తున్నారన్నారు. చివరకు విశాఖ వాసులకు తన ముఖం చూపించలేక పుట్టినరోజు వేళ విశాఖ నగరంలో కాకుండా చింతపల్లికి వెళ్లి అక్కడ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

మున్సిపల్ వర్కర్ల సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు ఈ నెల 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నారని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకట రెడ్డి, అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు తెలిపారు. బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వారు మీడియాతో మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చెయ్యాలని, ఇంజినీరింగ్ కార్మికులకు హెల్త్ రిస్క్ అలవెన్స్, క్లాప్ డ్రైవర్లకు రూ.18500 జీతం ఇవ్వాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని సమ్మెకు దిగుతున్నట్టు వెల్లడించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.

లూక్స్‌లో ఆక్యుపంక్చర్ శిబిరం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎండాడలోని డాక్టర్ లూక్స్ యోగా వెల్‌నెస్ సెంటర్‌లో ఉచిత ఆక్యుపంక్చర్, నేచారోపతి శిబిరం నిర్వహించారు. హైదరాబాద్ కాస్మిక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపంక్చర్ సంస్థకు చెందిన ఆక్యుపంక్చర్ వైద్యులు, సెంటర్ ఫర్ యోగా వెల్నెస్ సంస్థకు చెందిన యోగా గురువు కొండా శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి మందులు, ఇంజక్షన్లు, ఆపరేషన్లు అవసరం లేకుండా రోగాలను తగ్గించడమే ఆక్యుపంక్చర్ వైద్య ముఖ్య లక్షణమని తెలియజేశారు.

భూములకు రక్షణ కల్పించాలి

రైతుల వినూత్న నిరసన

అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలుచుని చేతులు జోడించి నిరసన చేపడుతున్న రైతులు

ప్రజాశక్తి -అనంతగిరి: తమ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు అక్రమంగా వెబ్‌ల్యాండ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని కబ్జాకు పాల్పడ్డారని గిరిజన రైతులు అర్ధ నగ్నంగా మోకాళ్ళపై చేతులు జోడించి వినూత్న రీతిలో దీక్ష చేపట్టారు. మండలంలోని నాన్ షెడ్యూల్ పంచాయితీ పరిధి రొంపల్లి చిన్నకోనెల, బూరిగ, గ్రామాలకు చెందిన రైతులు వినూత్న రీతిలో బుధవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు భూరిగ పెంటయ్య, కె.సింహాచలం ఎస్.సన్యాసిరావు మాట్లాడుతూ, తాత ముత్తాతల కాలం నుండి సాగులో ఉన్న తమ భూములను మైదాన ప్రాంతాలకు చెందిన కొంతమంది భూస్వాములు కన్ను వేసి కబ్జాకు పాల్పడ్డారన్నారు. సర్వే నెంబర్ 1 నుండి 7 వరకు ఉన్న భూమి 80 ఎకరాలు రెండు గ్రామాలకు చెందిన 60 కుటుంబాలు వ్యవసాయ పంటలు పండించుకుంటూ జీవనాధారం కొనసాగిస్తున్నామని తెలిపారు. తమకు ఎటువంటి సమాచారం లేకుండా రెవిన్యూ అధికారులతో కుమ్మక్కై 2020 సంవత్సరంలో రిజిస్ట్రేషన్లు చేపట్టారని, దీనిపై సబ్ కలెక్టర్కు ఫిర్యాదు చేయడంతో ఆర్ఆర్ కేసు నమోదు చేశారన్నారు. దీనికి విరుద్ధంగా భూస్వాముల పేరిట ఆన్లైన్ కార్యక్రమాలు ఏ విధంగా చేపట్టారని ప్రశ్నించారు. అల్లూరి జిల్లాలో పర్యటనకు వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె

మద్దతు ప్రకటించిన సిపిఎం

మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు : సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. బుధవారం పాడేరు ఐటిడిఏ ఎదుట నిరసన దీక్ష ప్రారంభించారు. అల్లూరి జిల్లా ఏజెన్సీ మండలాల నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగులు తరలి వచ్చారు. తమ సమస్యల పరిష్కారం కోసం గత మూడు నెలలుగా దశల వారి ఆందోళన నిర్వహిస్తున్న సంగతి విధితమే. ప్రభుత్వం నుంచి స్పందన కరువు అవడంతో ముందుగా నిర్ణయించిన మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెకు దిగారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగస్తుల సమ్మెకు సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పల నరస మద్దతు ప్రకటించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె దీక్ష శిబిరాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.సుందర్రావు ప్రారంభించారు.. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన రెగ్యులైజేషన్ హామీని తక్షణమే అమలు చేసి సమ్మెను విరమింప చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనరస డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఓట్ల కోసం సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగస్తులను రెగ్యులైజేషన్ చేస్తానని హామీ ఇచ్చి నేటికీ నాలుగున్నర సంవత్సరాలైనా పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉప సంఘం సిఫార్సులో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగస్తులను రెగ్యులైజేషన్ చేసేందుకు సిఫార్సు కూడా చేయలేదన్నారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే రెగ్యులేషన్ చేయకపోగా గత నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. డిజిటల్ ఎడ్యుకేషన్ పేరుతో ట్యాబులు పంపిణీ చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి బైజుస్ కార్పొరేట్ కంపెనీతో ఒప్పందం చేసుకొని ప్రపంచ బ్యాంకు నుంచి 2000 కోట్ల రూపాయలు అప్పు తీసుకొచ్చి కనీసం విద్యారంగం అభివృద్ధి కి కృషి చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగస్తులపై వివక్షత ప్రదర్శించడం దారుణమన్నారు. సమస్యలు పరిష్కరించడంలో మొండి గా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా జేఏసీ నాయకులు వి. జయరాజు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అల్లూరి జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్, సింహాచలం, గౌరీ శంకర్ వెంకటరమణ దొర, సుభద్రమ్మ, అనంతలక్ష్మి, మరియు అల్లూరు జిల్లా సమగ్ర శిక్షణలో వివిధ విభాగంలో పనిచేస్తున్న సుమారు 600 మంద ఉద్యోగులు పాల్గొన్నారు.

గాజువాకలో వైసిపి ఎమ్మెల్యే గెలుపు బాధ్యత నాదే!

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టిక్కెట్ ఎవరికిచ్చినా గెలిపించే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక టిఎన్ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, రెండు రోజుల క్రితం తాను, తన ఇద్దరు కుమారులతో సిఎం జగన్‌ను కలిశానన్నారు. ఈ సందర్భంగా సర్వేల ఆధారంగా టిక్కెట్లు కేటాయింపు ఉంటుందని, ముందు పార్టీని బతికించాలని, తర్వాత మిగతావి తాను చూసుకుంటానని సిఎం జగన్ సూచించారన్నారు. ముఖ్యమంత్రి సూచన మేరకు ఎమ్మెల్యే ఎవరైనా తాను వారి గెలుపునకు కృషిచేస్తానన్నారు. ఎన్నికల ముందు వరకు ప్రస్తుతమున్న అభ్యర్థులు ఖరారు కాదన్న విషయాన్ని సిఎం జగన్ తెలిపారన్నారు. నియోజకవర్గంలో త్వరలో భారీఎత్తున అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకుటి చందు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట తప్పిన ప్రభుత్వం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అంగన్‌వాడీలపై ప్రభుత్వం పంతానికి పోతోంది తప్ప న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడానికి మార్గాలను అన్వేషించడంలేదు. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులకొట్టించి సచివాలయ సిబ్బందికి అప్పగిస్తున్న ప్రభుత్వం కేంద్రాల్లోని సరుకుల భద్రతను విస్మరించింది. పిల్లలకు సరఫరా చేసే సరుకులు పోతే అందుకు బాధ్యులెవరన్నదీ ఆలోచించడంలేదు. బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన జిఒ పుండుపై కారంజల్లినట్లుంది. ఇంతవరకూ నెలకు రెండు సమావేశాలకు ఇచ్చే టిఎ, డిఎలు తాజా జిఒలో కార్యకర్త, సహాయకురాలుకు ఒక సమావేశానికి ఇవ్వనున్నట్లు పేర్కొంది. 2017 నుంచి ఇవ్వాల్సిన టిఎ, డిఎ బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం ఎటువంటి హామీ ఇవ్వలేదు. సహాయకులకు కార్యకర్తల ప్రమోషన్ వయస్సు 45 నుంచి 50 ఏళ్లకు పెంచింది. ప్రభుత్వ చర్యలు సమస్యలు పరిష్కరించేలా లేకపోవడంతో అంగన్‌వాడీలు సమ్మె కొనసాగిస్తున్నారు. గురువారం జిల్లా వ్యాపితంగా మండల కేంద్రాల్లో మానవహారాలు చేపట్టనున్నారు.

ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి

ప్రాజెక్టు ఆఫీసులకు అంగన్‌వాడీలు అధికారికంగా రెండు సమావేశాలకు, అనధికారికంగా అధికారులు అప్పగించిన వివిధ పనుల నిమిత్తం కనీసంగా మరో ఆరు సార్లు వెళ్లాల్సి వస్తోంది. ఈ సమావేశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని టిఎ, డిఎలు చెల్లించాల్సిందిపోయి గతంలో రెండు సమావేశాలకు ఇవ్వాల్సిన టిఎ, డిఎలను ఒక సమావేశానికి తగ్గించింది. ఈ చర్యలు అంగన్‌వాడీల్లో అసంతృప్తిని పెంచాయి. ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాలని, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని నాలుగేళ్ల నుంచి ప్రభుత్వానికి అంగన్‌వాడీలు విన్నవించుకుంటూ వస్తున్నారు. ప్రభుత్వం వినిపించుకోకపోవడంతో అనేక సార్లు ఆందోళనలు చేశారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో అనివార్యంగా ఈ నెల 12 నుంచి సమ్మెకు దిగారు. గ్రాట్యూటీ, ఉద్యోగ విరమణ, ప్రభుత్వ పథకాలు అమలు

హామీలు విస్మరణ
తాజా జిఒలో సదుపాయాల కోత
అంగన్‌వాడీల్లో మరింత ఆగ్రహం
ఉధృతం కానున్న సమ్మె - నేడు మానవహారాలు

చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును, పెరుగుతున్న ధరలకు తగినట్లు పిల్లల మెనూ ఛార్జీలు పెంచాలని, తెలంగాణ కంటే ఎక్కువ జీతం చెల్లిస్తామని ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలుచేయాలని అంగన్‌వాడీలు అడుగుతున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాల్సిన ప్రభుత్వం మాట తప్పింది. హామీలను అమలుచేయాలని శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై నిర్బంధం ప్రయోగిస్తోంది. కఠినంగా వ్యవహరిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను రాత్రుల్లో పగలుకొట్టిస్తోంది. సచివాలయ సిబ్బందికి అంగన్‌వాడీ కేంద్రాలను అప్పగిస్తోంది. వాలంటీర్లను కూడా రంగంలోకి దించుతోంది. అంగన్‌వాడీలను భయపెట్టడానికి ప్రభుత్వం ఎన్ని మాయోపాయాలు పన్నినా అంగన్‌వాడీల సమ్మెకు లబ్ధిదారులు, గ్రామస్తుల మద్దతు లభిస్తోంది. జిల్లాలో 1725 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 183 మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న 1693 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 1663 మంది సహాయకులు, 173 మంది మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో వున్నారు.

భయపడేది లేదు

అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులకొట్టినా భయపడి వెనక్కుతగ్గేదిలేదు. శాంతయుతంగా సమ్మె చేస్తున్నాం. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుంది.

ఎం.నాగశేషు, జిల్లా ప్రధాన కార్యదర్శి,
అంగన్‌వాడీ వర్కర్సు అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు),
అనకాపల్లి జిల్లా

కప్పరాడ పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సురేష్‌కుమార్ బుధవారం కప్పరాడలోని జివిఎంసి ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులను పరిశీలించారు. వివిధ సబ్జెక్టులపై విద్యార్థుల విషయావగాహనను, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షా విధానంపై అవగాహన కల్పించారు.

దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లిపై

వైసిపి సీనియర్లు ధ్వజం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలోని వైసిపికి చెందిన ఎనిమిది మంది కార్పొరేటర్లు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌పై తిరుగుబాటు చేసి 24 గంటలు కాకుండానే నియోజవర్గంలోని పలువురు వైసిపి సీనియర్ నాయకులు తిరుగుబావుటా ఎగరవేశారు. నియోజవర్గానికి చెందిన వైసిపి సీనియర్ మాజీ కార్పొరేటర్, దళిత నేత కొప్పుల వెంకటరావు, మరొక మాజీ కార్పొరేటర్ పోలిపల్లి జ్యోతి తదితరులు బుధవారం సాయంత్రం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ టిడిపి నుంచి నెగ్గిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తన వ్యక్తిగత స్వప్రయోజనాల కోసం, అధికార వైసిపిలో చేరారని ఆరోపించారు. పార్టీ అధినాయకత్వం సూచన మేరకు మొదటినుంచీ వైసిపిలో ఉన్న తాము ఆయనతో కలిసి పని చేయడానికి ఇష్టపడ్డామని చెప్పారు. అయితే గణేష్ కుమార్ తమ వంటి సీనియర్లను పట్టించుకోవడం మానేశారని ఆవేదన చెందారు. వార్డుల్లో పర్యటించినప్పుడు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల సందర్భంలోనూ కనీసం మాటవరసకు కూడా తమను సంప్రదించటం లేదని విమర్శించారు. గణేష్ కుమార్ వల్ల తమకు జరిగే నష్టం కంటే, పార్టీకి జరిగే నష్టం అధికంగా ఉందని తెలిపారు. అతని వైఖరిలో మార్పు వస్తుందని తాము ఇంతవరకూ వేచి ఉన్నామని, అయినప్పటికీ మార్పు రాలేదు సరి కదా తమపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి పరిస్థితులలో గణేష్ కుమార్‌ను మళ్లీ పోటీకి నిలపొద్దన్నారు.

జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీలు

గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా విద్యాశాఖ భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీలు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కోఆర్డినేటర్ రమణ మూర్తి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులు ఈనెల 30వ తేదీ లలో విజయవాడ లో జరిగే రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కోఆర్డినేటర్ రమణ మూర్తి నాయుడు, జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ కె.జె.రామారావు స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు విశ్వ ప్రసాద్ పర్యవేక్షణలో జరిగాయి.

విశాఖలో అణు పరిశోధనా కేంద్రం

వార్షికోత్సవాలను ప్రారంభిస్తున్న డాక్టర్ యూసుఫ్

ప్రజాశక్తి- మధురవాడ : విశాఖలో దేశంలోనే అతి పెద్దదైన బార్క్ అణు పరిశోధన కేంద్రాన్ని నెలకొల్పనున్నట్లు బార్క్ ఫిజిక్స్ గ్రూప్ డైరక్టర్ డాక్టర్ ఎస్ఎమ్.యూసఫ్ అన్నారు. బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో భారత అణుశక్తి విభాగానికి అనుబంధంగా గల బోర్డు ఆఫ్ రీసెర్చి ఇన్ న్యూక్లియర్ సైన్సెస్ ఆధ్వర్యంలో సాలిడ్ స్టేట్ ఫిజిక్స్‌పై నిర్వహించిన 67వ వార్షిక సమావేశాలను ప్రారంభించారు.. వందలాద మంది అణుశాస్త్ర పరిశోధకులు పాల్గొన్న సమావేశంలో డాక్టర్ యూసుఫ్ మాట్లాడుతూ విశాఖలలో నెలకొల్పనున్న బార్క్ ఆటమిక్ రీసెర్చి సెంటర్ ద్వారా క్వాంటం ఫొటేనిక్స్ వంటి అంశాలపై అధ్యయనాలు చేస్తామన్నారు. విశాఖలోని పరిశోధన సంస్థలకు, గీతం వంటి విద్యాలయాలకు మేధోసహకారాన్ని అందిస్తూ మెరుగైన పరిశోధనలను బార్క్ సెంటర్ ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. బార్క్ ఆస్ట్రో ఫిజికల్ సైన్సెస్ విభాగం లడాఖ్‌లో నెలకొల్పిన అట్మాస్ఫియిరిక్ టెలిస్కోప్ ద్వారా జరుగుతున్న పరిశోధనలను వివరించారు.

గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం మాట్లాడుతూ, భౌతిక, రసాయన, జీవశాస్త్రాల మధ్య అంతర్విభాగ పరిశోధనలు చేపట్టాలని సూచించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బెంగుళూరు ప్రాంగణంలో సైన్స్ పార్క్‌ను నెలకొల్పుతున్నామని, హైదరాబాద్ ప్రాంగణంలో ఔషధ పరిశోధనల కేంద్రం ఏర్పాటు కానుందన్నారు.. గీతం విశాఖ ప్రాంగణంలో మూర్తి పరిశోధన కేంద్రం బార్క్, మెడ్‌టెక్ జోన్ వంటి సంస్థలతో కలిసి ముందుకు నడవడానికి సిద్ధంగా ఉందన్నారు. భౌతిక శాస్త్ర కోణం నుంచి జీవ శాస్త్రాలను పరిశోధించాలని నూతన ఆవిష్కరణలను వెలుగులోకి తేవాలన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ మాట్లాడుతూ సైన్స్ పరిశోధనలు ద్వారా నూతన విజ్ఞాన శాస్త్రాలు ఆవిర్భవిస్తున్నాయన్నారు. సాలిడ్ స్టేట్ ఫిజిక్స్ ద్వారా భౌతిక శాస్త్రంలో నూతన విభాగాలను వివరించారు. సదస్సు కన్వీనర్‌లు డాక్టర్ ఎల్ఎమ్.పంత్, డాక్టర్ జి.రవికుమార్ మాట్లాడారు. సదస్సు కార్యదర్శి డాక్టర్ మోహిత్ త్యాగి, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ భౌతిక శాస్త్ర విభాగం అధిపతి చైతన్య వర్మ సదస్సులో చర్చించే అంశాలను వివరించారు.

అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని బంధపల్లి గ్రామంలోని గిరిజన ఆశ్రమ సంక్షేమ ఉన్నత పాఠశాలలో అగ్నిమాపక శాఖ వారి ఆధ్వర్యంలో అగ్నిప్రమాదలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వంట గ్యాస్ సిలిండర్ ఫైర్ అయినా, మరే ఇతర అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో ఏ విధమైన జాగ్రత్తలను తీసుకోవాలి, ఏ విధంగా దానిని అదుపు చేయాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది బి.రామచంద్రరావు (ఎల్ఎఫ్,) జె.నాగేశ్వరరావు (డి.ఓ.పి), డిఎల్.నారాయణ (ఎఫ్.ఎమ్), పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాపనమ్మను నివాళి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ఆదివాసి జేఏసీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు కంగల శ్రీనివాస్ భార్య సంకురు బాపనమ్మ ఇటీవల మృతి చెందగా, ఆమె చిత్రపటానికి మండలంలోని ఐ.పోలవరం గ్రామంలో ఆదివాసి జేఏసీ రాష్ట్ర కమిటీ చైర్మన్ టి.బాబురావు నాయుడు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు, గంగరాజు, ముఖి శేషాద్రి, తెల్లం శేఖర్, మద్దేటి జగన్నాథ్ రెడ్డి, ఇతర నాయుకలు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

రంపచోడవరం : ఏజెన్సీలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్నట్లు రంపచోడవరం శాసన సభ్యురాలు నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో నిరుపేద కుటుంబాలకు హెచ్‌పీ గ్యాస్ కనెక్షన్లు, ఇండియన్ గ్యాస్ కనెక్షన్లు పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఐదువేల రూపాయలు ఖరీదు చేసే గ్యాస్ కనెక్షన్లు హెచ్‌పీ గ్యాస్ కనెక్షన్లు 50, ఇండియన్ గ్యాస్ కనెక్షన్లు 20 మొత్తం 70 మంది అర్హులైన నిరుపేద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బంధం శ్రీదేవి, జడ్పిటిసి సభ్యురాలు పండ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండ కుమారి, జిసిసి డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశం, ఎంపీడీవో హరికృష్ణ, సర్పంచులు ఎం.బొజ్జయ్య, కుంజం వెంకటలక్ష్మి, వడగల ప్రసాద్, కోసు రమేష్, చెదల దేవి, ఆనంద్, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, యస్.కృష్ణకుమారి, మాజీ ఎంపీపీ అరగాడి సత్యనారాయణ రెడ్డి, బి. శేఖర్, జె.రామన్న దొర, పండ రామకృష్ణ, బత్తిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయులో చిన్నయసూరి జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగంలో పరవస్తు చిన్నయ సూరి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. తెలుగు విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పరవస్తు చిన్నయసూరి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో నరసింహారావు మాట్లాడుతూ పద్యానికి ఆద్యులు నన్నయ అయితే గద్యానికి చిన్నయ ఆద్యులని తెలిపారు. వారు తెలుగు భాషామతల్లి మెడలో అలంకరించిన పూదండ వంటివారని కొనియాడారు. విద్యార్థులు సులభంగా, సరళంగా తెలుగు భాషా మాధుర్యాన్ని గ్రహించటానికి నీతిచంద్రికలోని మిత్రలాభం, మిత్రబేధం రచించిన భాషాసేవకుడన్నారు. వ్యాకరణ సంప్రదాయానికి చిన్నయసూరి అందించిన సేవలను ప్రస్తుతించారు. చిన్నయసూరి కుటుంబ వారసుడు ఫణిశయన సూరి తమ కుటుంబ చరిత్రను వివరించారు.